క్లుప్తంగా

ఘనంగా తెరవే కవి సమ్మేళనం



సాహితీ సమ్మేళనంలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతి నికేతన్ కళాశాల ఆవరణలో తెలుగు రచయితల వేదిక (తెరవే) 96వ నెలసాహితీ సమావేశం ఆదివారం జరిగింది. తెరవే అధ్యక్షులు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తిలు ఆధ్వర్యంలో జరిగిన సాహితీ సభలో వక్తలు మాట్లాడుతూ.. కవితలు సమాజాన్ని జాగృతం చేసేవిగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కవులు ఐఎన్‌డీ ప్రసాద్ (నడిచే సరస్వతి), తోట గోపాలరావు (యుద్ధం), తంగి ఎర్రమ్మ (అక్షర నీరాజనం), లలితారెడ్డి (తరువులే గురువులు), నాగేశ్వరరావు (స్వాతంత్ర్య దినం), రమణమూర్తి (గురుబ్రహ్మ), గుడిమెట్ల గోపాలకృష్ణ (పెళ్లి), బి.జగన్నాధరావు (విత్తనం–చెట్టు), కె.బాలాజీ రవికిరణ్ (అతడు అత డె), సోడవరం ఈశ్వరరావు (ఎవరి నిర్లక్ష్యమో), కవితలు చదివి వినిపించారు. కళాశాల ప్రిన్సిపాల్ అప్పలరాజు, భాషాభిమానులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి గ్రామంలో పేద మహిళలకు సమగ్ర శిశు మహిళాభివృద్ధి సేవా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద మహిళల ఆర్థిక ప్రగతే తమ సంస్థ లక్ష్యమన్నారు. ప్రభుత్వాలు మహిళల స్వయం ఉపాధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నాయకులు బల్లాడ వెంకట అప్పారావు, అలుపాన నాగిరెడ్డి పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న ఎంపీడీఓ నిశ్చెల

జి.సిగడాం: వర్షాల కారణంగా గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండా ఉండేందుకు వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కె.నిశ్చెల సూచించారు. ఆదివారం వెలగాడ గ్రామంలో అతిసార వ్యాధితో బాధపడుతున్న రోగుల వివరాలు, వ్యాధి రావడానికి గల కారణాలపై ఆరా తీశారు. గ్రామ స్థాయిలో నియమించిన వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా అతిసార వ్యాధి, డెంగీ, మలేరియా జ్వరాలపై ఎప్పటికప్పుడు ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌ఎహెచ్‌పీల ద్వారా సమాచారం తీసుకుని సకాలంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయలన్నారు. బాతువ పీహెచ్‌సీ వైద్యాధికారులు అనుష, ప్రతిష్ట శర్మ మాట్లాడుతూ వెలగాడలో అతిసార వ్యాధిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని, అతిసార వ్యాధి తగ్గుముఖం పట్టేవరకు గ్రామంలో ప్రత్యేక శిబిరాలను కొనసాగిస్తామన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. సర్పంచ్ బొల్లా జనార్దనరావు, పంచాయతీ కార్యదర్శి చేబ్రోలు సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అపుస్మా జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణరావు ఎన్నిక



నూతన కమిటీ ప్రతినిధులతో బి.లక్ష్మణరావు, శ్రీకాంత్, మోహనరావు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (అప్పుస్మా) జిల్లా శాఖ నూతన అధ్యక్షుడిగా బూరగాపు లక్ష్మణరావు, గౌరవాధ్యక్షుడిగా పోలుమహంతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మోహనరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలో జరిగిన అపుస్మా జిల్లాశాఖ కార్యవర్గ సమావేశంతోపాటు నూతన కమిటీ ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికైన నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతు ప్రైవేటు పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

చల్లపేటలో పెరుగుతున్న కిడ్నీ రోగులు!

- వ్యాధి లక్షణాలతో ఒకరి మృతి



అప్పలస్వామి (ఫైల్)

అరసవల్లి: గార మండలం అంపోలు పంచాయతీ చల్లపేట గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నార. తాజాగా బాకి అప్పలస్వామి(65) కిడ్నీ వ్యాధితో గత కొంత కాలంగా బాధపడుతూ ఆదివారం వేకువజామున మృతి చెందాడు. ఇటీవల కాలంగా చల్లపేట గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండగా, మృతుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, నిపుణులతో కూడిన బృందంతో కలిసి ఈ గ్రామంలో పరిస్థితులను అధ్యయనం చేయాలని, తద్వారా కిడ్నీ వ్యాధి నుంచి తమను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతుడు అప్పలస్వామికి భార్య అప్పలనర్సమ్మ, కుమారుడు రాము, ఇద్దరు కుమార్తెలున్నారు.

● ఘనంగా మహాలింగార్చన



అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం అనివెట్టి మండపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో మహాపర్వం శివ పంచాయతన సహిత మహాలింగార్చనను అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ, వేదపండితులతో కలిసి అర్చనాభిషేకాలు చేశారు. -అరసవల్లి

● భక్తిశ్రద్ధలతో గోపూజ



శ్రీకాకుళం నగరంలోని బలగ నాగావళి నదీ తీరాన ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఆదివారం గోపూజా కార్యక్రమం జరిగింది. భక్తులు గోమాతలకు ఆహారం అందించి గోపుష్టికి పూజలు నిర్వహించారు. అలాగే కాలభైరవ స్వామి పీఠం ఆలయంలో కాలభైరవస్వామివారికి అభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. - శ్రీకాకుళం కల్చరల్

● కూచిపూడి ప్రదర్శన



ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాశిలో జరిగిన కూచిపూడి నాట్య గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో రణస్థలం విద్యార్థినులు పాల్గొని ప్రతిభను కనబర్చారు. అకెళ్ల సౌగంధిక, గుడిపాటి లాస్య ప్రియ, పిన్నింటి పూజిత, కూచిపూడి శిక్షణ నిర్వాహకురాలు నారాయణశెట్టి శైలజలు హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థినులకు వరల్డ్ రికార్డ్ మెడల్, ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు. -రణస్థలం

తప్పిన ముప్పు



బడివానిపేట తీరంలో సముద్ర అలలు



బుడగుట్లపాలెం తీరంలో నిలిపివేసిన పడవలు



జాతీయ రహదారిపై వర్షం నీటిని పరిశీలిస్తున్న అధికారులు



తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి చిట్టిరాజు

ఎచ్చెర్ల క్యాంపస్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం నేపథ్యంలో గత నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎచ్చెర్లకు ప్రత్యేకాధికారిగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ చిట్టిరాజును నియమించారు. ప్రత్యేకాధికారితోపాటు తహసీల్దార్ జి.సింహాచలం, ఎంపీడీఓ రమాదేవి శనివారం రాత్రి, ఆదివారం ఉదయం తీర గ్రామాలు, నదీతీర ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఎచ్చెర్ల మండలంలో ఎటువంటి వరదనష్టం, ఆస్తి నష్టం నమోదు కాలేదు. నాలుగు రోజులుగా డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలెం పంచాయతీల మత్స్యకారులు చేపల వేటకు దూరంగా ఉన్నారు. వర్షాలు కురవటంతో వరిసాగు చేస్తున్న రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

లోతట్టు ప్రాంతాలైన బొంతలకోడూరు, పొన్నాడ, ధర్మవరం, తమ్మినాయుడుపేట వంటి ప్రాంతాల్లో సైతం ఎటువంటి నష్టం నమోదు కాలేదు. క్షేత్రస్థాయి అధికారులతో ప్రత్యేకాధికారి చిట్టిరాజు తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఎటువంటి నష్టం వాటిల్లినా నివేదిక అందజేయాలని వీఆర్వోలకు సూచించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టాయి.

లోతట్టు ప్రాంతాలు పరిశీలన

శ్రీకాకుళం అర్బన్: విపత్కర పరిస్థితులలో లయన్స్ క్లబ్ సెంట్రల్ బాధితులకు అండగా ఉంటుందని క్లబ్ మెంటార్ నటుకుల మోహన్ అన్నారు. శ్రీకాకుళం మండలం గనగలవానిపేట గ్రామంలో లోతట్టు ప్రాంతాలను క్లబ్ సభ్యులు ఆదివారం పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. గ్రామస్తులకు మందులు, పాలు, బిస్కెట్లు, అరటిపళ్లను అందజేసినట్టు మోహన్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఉన్నారు.

ప్రజలు సురక్షితంగా ఉండాలి



జీరుపాలెం గ్రామాన్ని డ్రోన్‌తో పరిశీలిస్తున్న అధికారులు



జీరుపాలెం తీర ప్రాంతంలో పర్యటిస్తున్న అధికారులు

రణస్థలం: తుఫాన్ నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు సురక్షితంగా ఉండాలని మండల ప్రత్యేక తుఫాన్ పరిశీలన, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.లక్ష్మణమూర్తి సూచించారు. మండలంలోని జీరుపాలెం, కొత్తముక్కాం, దొనిపేట, కొవ్వాడ, కొచ్చెర్ల గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ప్రజలతో మాట్లాడి శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, పూరిళ్లల్లో ఉన్నవారు తుఫాన్ షెల్టర్లకు మారాలన్నారు. వైద్య సదుపాయ ఏర్పాట్లను పర్యవేక్షించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే జనరేటర్‌ను అందుబాటులో ఉంచారు. నిత్యావసర సరకులు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రజలను అప్రమత్తం చేశారు. మరోరెండు రోజులు మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. తీర ప్రాంత గ్రామాలను డ్రోన్ కెమెరాతో చిత్రీకరించి పరిశీలన చేశారు. తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు, ఎంపీడీఓ ఆర్.రమణమూర్తి, మత్స్యకార పెద్దలు మైలపల్లి కామరాజు, దుమ్ము ఆశోక్ తదితరులు ఉన్నారు.

అరసవల్లిలో శ్రావణ మాస ప్రత్యేక పూజలు



మండపంలో సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం శ్రావణ మాస ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రత్యేక ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆదిత్యున్ని దర్శించుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేకంగా తులసీదళాలతో ఆదిత్యుని మూలవిరాట్టుకు అలంకరించి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో సర్వదర్శనాలకు అనుమతించారు. ఇక అన్నదాన ప్రసాదానికి భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లి ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే విరాళాలను సమర్పించారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్లు, విరాళాల ద్వారా రూ.78 వేలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.20 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ వర్గాలు తెలియజేశారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

జి.సిగడాం: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని ముషినివలస పంచాయతీ సర్వేశ్వరపురం ప్రధాన రహదారిలో ఉన్న ఆయన విగ్రహం వద్ద నిర్వహిస్తున్నామని మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లడారు.

రాజన్న వర్ధంతి కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామ స్థాయిలో ఉన్న అభిమానులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రపోటీలకు చెస్ క్రీడాకారులు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్–9 బాల బాలికల చెస్ పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని జిల్లా చెస్ శిక్షణా కేంద్రంలో నిర్వహించిన ఈ ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్రపోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో డి.కార్తికేయ, వీ.శ్రీష్, ఎస్.గౌతమి ఉన్నారు.



చెస్ ఎంపిక పోటీల్లో ఎత్తుకు పైఎత్తులేస్తున్న చిన్నారులు

పాత పింఛన్ విధానమే కావాలి



వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలసి వినతి ఇస్తున్న ఏపీసీపీఎస్‌ఈఏ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీసీపీఎస్‌ఈఏ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఏపీసీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో పలువురు సెప్టెంబర్ 1ను సీపీఎస్ విద్రోహదినంగా భావించి శ్రీకాకుళంలో వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి వినతి పత్రం అందజేశారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌బాబు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడులను కూడా కలిసి వినతి పత్రాలు సమర్పించారు.

ఘనంగా ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు



వేడుకల్లో ఎస్‌బీఐ సిబ్బంది, కుటుంబ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ఆరో ఆవిర్భవ దినోత్సవాన్ని శ్రీకాకుళం ప్రధాన శాఖలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ స్టాఫ్ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ, ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ జనరల్ సెక్రెటరీ ఎల్. చంద్రశేఖర్, విశాఖపట్నం మాడ్యూల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సుష్మ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని శ్రీకాకుళం రీజినల్ సెక్రటరీ కేసీహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. ఏటా సెప్టెంబర్ ఒకటో తేదీన యూనియన్ సర్కిల్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. అనంతరం ఉద్యోగుల పిల్లలకు వ్యక్తిత్వ వికాసం, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. చిన్నపిల్లలకి ఆటలు ఆడించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ అబ్దుల్ హసిబ్ అమీర్, మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ప్రసాదరావు, ఆఫీసర్ అసోసియేషన్ రీజియన్ సెక్రటరీ కృష్ణకిషోర్, పెన్షనర్స్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బాపయ్య పంతులు ఉన్నారు.

3న వినాయక విగ్రహాల పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో ఉన్న లక్ష్మీగణపతి ఆలయం వద్ద వినాయక చవిత పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల మూడో తేదీన మట్టి వినాయక ప్రతిమలు, వ్రతకల్పం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తారు. ఈ విషయాన్ని షిర్డీసాయి సేవా సంఘం ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

7 నుంచి సాహిత్య గణపతి ప్రవచనాలు

శ్రీకాకుళం కల్చరల్: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉపనిషన్మందిరంలో ఈనెల ఏడు నుంచి 15వ తేదీ వరకు సాయంత్రం ఆరు గంటలకు సాహిత్య గణపతి ప్రవచనాలు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 7న శమంతకోపాఖ్యానంపై భాస్కరభట్ల శ్రీరామశర్మ, 8న శ్రీనాథ నైషధీయము–నలదమయంతుల వివాహంపై డాక్టర్ బారువ కోమలరావు, 9న మయూఖ మయూరంపై డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, 10న ఆంధ్రా వాల్మీకి– ఒక పరిచయంపై డాక్టర్ సనపల నారాయణమూర్తి, 11న కాశీఖండము–ప్రాశస్త్యంపై పైడి హరనాథరావు, 12న ఉదహరణ కావ్యములు– సాహితీ పరిశీలనపై డాక్టర్ పిలకా శంతమ్మ, 13న కాశీనగరము– వ్యాసుని భిక్షపై డాక్టర్ పి.వి.ఎస్.సాయి ప్రసాద్, 14న కరుణశ్రీ కవితాసుధపై పొందూరు సుధాకుమార్, 15న వామన చరిత్రపై ఓరుగంటి రాజరాజేశ్వరీ ప్రసాద్‌చే ప్రవచనాలు జరుగుతాయని, సాహిత్యాభిమానులంతా పాల్గొనాలని కోరారు.

ఉమాజలలేశ్వరుడుకి ప్రత్యేక అలంకరణ



ఉమారుద్రునికి హారతి



ప్రత్యేక అలంకరణలో ఉమాజలలేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: మాస శివరాత్రి సందర్భంగా పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలు ఆదివారం జరిగాయి. ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు అరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో ఉమారుద్రకోటేశ్వరస్వామికి అభిషేకాలు చేసి అనంతరం హారతులు ఇచ్చి అలంకరణ చేశారు. అలాగే నక్కవీధిలోని ఉమాజలలేశ్వరస్వామి దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి.

ప్రజాహిత కార్యక్రమాలు విస్తృతం



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి ఈ ఏడాదికి సంబంధించిన సేవా కార్యక్రమాల నిర్వహణకుగాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసా అవార్డు వచ్చిందని క్లబ్ అధ్యక్షులు జగన్నాధం నాయుడు అన్నారు. నగరంలోని సానావీధిలో ఉన్న హారికా కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు హారికా ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల నాలుగో తేదీన ప్రభుత్వం పిలుపు మేరకు వనమహోత్సవంలో భాగంగా బి.ఎస్.ఎన్.ఎల్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. 5వ తేదీన పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక మట్టి ప్రతిమల పంపిణీ చేపడతామన్నారు. 29న రైతుబజారు ఎదురుగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని చెప్పార. ఈ సందర్భంగా క్లబ్ అప్పటి అధ్యక్షురాలు కరణం శోభారాణి, సెక్రటరీ రౌతు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు తర్లాడ అప్పలనాయుడులను సత్కరించారు. జోనల్ చైర్మన్ శోభారాణి, చింతాడ కృష్ణమోహన్, సెక్రటరీ మణిశర్మ, కోశాధికారి లక్ష్మీకాంత్, లక్ష్మీపతి, మజ్జి సుమన్, నిహార్ నాయుడు, కరణం హారిక, గొంటి చంద్రమోహన్, గొంటి జ్యోతిర్మయి, తరలి చక్రవర్తి పాల్గొన్నారు.

కుప్పం, నిమ్మాడ నుంచి పింఛన్లు దర్యాప్తు చేయాలి

టెక్కలి: పింఛన్ల ప్రక్షాళన అంటూ మంత్రి అచ్చెన్నాయుడు పలుమార్లు ప్రకటనలు చేస్తున్నారని.. అయితే కుప్పం, నిమ్మాడ నుంచే పింఛన్లపై దర్యాప్తు చేయాలని నీటి సంఘం మాజీ అధ్యక్షుడు సత్తారు వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంత్రి అచ్చెన్నాయుడు పలు సందర్భాల్లో అనర్హత కలిగిన పింఛన్లు తొలగించేస్తామని చెబుతూ కక్ష సాధింపు చర్యలకు సిద్ధమవుతున్నారని వెంకటరమణ అన్నారు. కుప్పం, నిమ్మాడ నుంచి పింఛన్లపై అధికారులతో దర్యాప్తు నిర్వహించి ఆ తరువాత రాష్ట్ర వ్యాప్తంగా దర్యాప్తు చేస్తే బాగుంటుందన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో నగరంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవతా సేవా సంస్థ నైతిక విలువలతో కూడిన నవసమాజ నిర్మాణం కోసం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా నగరంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, కోశాధికారి సింగూరు ప్రవీణ్‌కుమార్, అరుణకుమారి, సభ్యులు పి.రజనీకాంతరావు, పార్వతీశం, బరాటం లక్ష్మణరావు, తర్లాడ అప్పలనాయుడు, బ్రహ్మకుమారి, జయలక్ష్మి ఉన్నారు.

చిన్నారులకు వినాయక విగ్రహాల తయారీ పోటీ



తయారు చేసిన మట్టి విగ్రహాలతో చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసే పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా 35 మంది విద్యార్థులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. సంస్థ వ్యవస్థాపకులు ఎల్.నందికేశ్వరరావు క్లబ్ నిర్వాహకులు బి.ఎం.ఎ స్.పట్నాయిక్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రసాద్, ఎల్.దీప్తి పాల్గొన్నారు.